ప్రజాశక్తి
శనివారం 7 అక్టోబర్ 2023 5 శ్రీ సత్యసాయి





సమావేశంలో ప్రసంగిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

ఇళ్ల స్థలాల కోసం చిలమత్తూరులో గత 20 రోజులుగా పేదలు అనేక రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నారు. సిపిఎం, వ్యకాసం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భూస్వాధీన ఉద్యమం నిర్వహించి పట్టాలు ఇవ్వాలని కోరుతున్నారు. పలు దఫాలుగా వీరికి అధికారులు మాట ఇచ్చినట్టే ఇచ్చి తరువాత మార్చేస్తున్నారు. ఒకసారి పట్టాలిస్తామని.. మరోసారి మరోచోట ఇస్తామని.. ఉన్నతాధికారులతో మాట్లాడతామని.. ఇలా ఒకటేమిటి ఎన్ని కారణాలు చెప్పాలో అన్ని చెప్పి పేదలను మోసం చేసేలా అధికారులు ప్రవర్తిస్తున్నారు. పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వడంలో అధికారులు ఎందుకు ఇంతలా నాన్చుడు ధోరణి అవలంభిస్తున్నారనే దానిపై పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. చిలమత్తూరు మండలంలో అధికారులు, అధికార పార్టీ నాయకుల మధ్య నెలకొన్న విభేదాల నడుమ పేదలను బలిచేయాలని చూస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. అందులో భాగంగానే పట్టాలు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది.

ఇళ్ల పట్టాల కోసం చిలమత్తూరులో భూస్వాధీన పోరాటం నిర్వహిస్తున్న పేదలు (ఫైల్ ఫోటో)



‘అధికార’ వైరం.. పేదలకు నష్టం..!

ప్రజాశక్తి-చిలమత్తూరు

చిలమత్తూరు అధికార పార్టీలో గతంలో ఎమ్మెల్సీ ఇక్బాల్ వర్గానికి పూర్తిగా తహశీల్దార్ నాగరాజు సహకరించి, ఎంపిపి పురుషోత్తమ రెడ్డి వర్గాన్ని పట్టించుకోలేదన్న అపవాదును ఆయన మూటగట్టుకున్నారు. ఇటీవల హిందూపురం వైసిపి ఇన్‌ఛార్జి మార్పు అయిన తర్వాత దీపిక వర్గంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న ఎంపిపి పురుషోత్తమరెడ్డి వర్గానికి మండలంలో ప్రాధాన్యత ఏర్పడింది. అయినప్పటికీ ఎంపిపి వర్గానికి తహశీల్దార్ సహకరించ లేదని ఇటీవల హిందూపురంలో జగనన్న ఆరోగ్య సురక్షపై జరిగిన సమావేశంలో ఎంపిపి వర్గీయులు ప్రస్తావించారు. ఇలాంటి పరిస్థితుల్లో వీరి విభేదాలకు ప్రస్తుతం చిలమత్తూరులో భూస్వాధీన ఉద్యమాన్ని నిర్వహిస్తున్న పేదలను బలిచేస్తున్నారనే అపవాదు వ్యక్తం అవుతోంది. ఇళ్ల పట్టాల సమస్యను పరిష్కారం చేయడంలో రెవెన్యూ ముఖ్య అధికారులు పూర్తిగా విఫలం అయ్యారు. దీనిని అవకాశంగా చూపి తహశీల్దార్‌ను బదిలీ చేయించేలా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెల్దాం అని వైసిపి మండల ముఖ్యప్రజాప్రతినిధులు యోచించినట్లు తెలుస్తోంది. అధికార పార్టీతో విభేదాలున్న తహశీల్దార్ వారితో ఇమడలేక తాను కూడా బదిలీపై వెళ్లిపోవాలనే భావనను తోటి సిబ్బంది వద్ద వ్యక్తం చేస్తున్నారు. భూస్వాధీన ఉద్యమంలో భాగంగా మొదట 5 రోజుల్లో పట్టాలు ఇస్తామని, ఆ తర్వాత వారంలో పరిష్కరిస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారు. ఇలా హామీ ఇచ్చినట్టే ఇచ్చి రెండు రోజుల క్రితం పేదలు వేసుకున్న గుడిసెలను పోలీసుల సమక్షంలో జెసిబిలతో తొలగించారు. ఓ వైపు పట్టాలు ఇస్తామని, మరోవైపు గుడిసెలను తొలగించడంపై పేదలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్థలాన్ని రిజర్వు చేసిన మాట వాస్తవమేనా..?

చిలమత్తూరులో పేదలు ఇళ్ల స్థలాల కోసం గత 14 రోజులుగా గుడిసెలు వేసుకున్న 805-6, 805-7 సర్వే నెంబర్లోని స్థలాన్ని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ఉన్నతాధికారులు రిజర్వు చేశారని, అందుకే అందులో ఇళ్ల పట్టాలు ఇవ్వలేకున్నామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. రిజర్వ్ చేసినట్లు అప్పటి కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల కాగితాన్ని ఇవ్వాలని పేదలు అడిగితే మౌనమే సమాధానంగా వస్తోంది. ఇటీవల జాయింట్ కలెక్టర్‌కు ఇళ్ల పట్టాల కోసం పంపిన ఉత్తరంలో కూడా సర్వే నెంబర్ 805-6, 805-7కు సంబంధించిన ప్రస్తావన లేకుండా కేవలం జాతీయ రహదారి పక్కన స్థలంలో గుడిసెలు వేసుకున్నారని ఈ సమస్యను పరిశీలించాలనే మాత్రమే పేర్కొన్నారు. పేదలను ఖాళీ చేయించిన తర్వాత అయినా ప్రభుత్వ రిజర్వు స్థలం అన్న బోర్డును అక్కడ పెట్టలేదు. దీనికి తోడు 1బి అడంగల్‌లోనూ ప్రభుత్వం తొలిత అసైండ్ చేసిన రైతుల పేర్లే కన్పిస్తున్నాయి. ఆ పేర్లు ఉన్న వారు కూడా ప్రస్తుతం భూ స్వాధీన పోరాటంలో గుడిసెలు వేసుకున్న వారి జాబితాలో ఉన్నారు. ఈ భూమిని అక్రమార్కులకు కట్టబెట్టేందుకు అధికారులు ఇలా మీనమేషాలు లెక్కిస్తున్నారంటూ ముందునుంచి సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.

◆ ఇళ్లపట్టాల పంపిణీలో మొండితనం వెనుక మర్మం ఏమిటి.?

◆ అధికార పార్టీ... అధికారుల మధ్య వైరం.. ◆ బలవుతున్న ‘చిలమత్తూరు’పేదలు

పేదలకు ఇచ్చేందుకు స్థలం లేదా..?

చిలమత్తూరులో ఇళ్ల స్థలాల కోసం పేదలు గత 20 రోజులుగా దశల వారీగా ఉద్యమాన్ని సిపిఎం, వ్యకాసం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వీరిలో అధిక భాగం ప్రభుత్వం కోదూరు లేఅవుట్‌లో అధికారులు లబ్ధిదారులుగా గుర్తించిన వారే ఉన్నారు. మూడేళ్ల అయినా ఆ సమస్య కోర్టులో తేలకపోవడంతో ఆ వివాదాస్పద భూమి మాకొద్దని తొలిత జగనన్న లేఅవుట్ వేసిన వాటిలో ఇవ్వాలని పేదలు కోరారు. అక్కడ, ఇక్కడా అంటూ పేదలను మభ్యపెట్టడం తప్పా ఇప్పటి వరకు వారికి ఇళ్ల పట్టాల పంపిణీపై స్పష్టమైన హామీ ఇచ్చిన సందర్భం లేదు. మూడేళ్లుగా పేదలకు రెండు సెంట్ల స్థలం ఇచ్చేందుకు ప్రభుత్వ స్థలమే లేదా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

పేదల గుడిసెలకు నిప్పు

పేదలు వేసుకున్న గుడిసెలను గురువారం ఉదయం జెసిబిలతో ధ్వంసం చేసిన రెవెన్యూ అధికారులు, పోలీసులు వాటికి శుక్రవారం నిప్పు పెట్టి ధ్వంసం చేశారు. ఇంటి పట్టాలు ఇవ్వకుంటే గుడిసెలను పీకేసినా సర్వేనెంబర్ 805-6, 805-7లోనే తిరిగి గుడిసెలు వేస్తామని పేదలు సిపిఎం నాయకులు ప్రకటించడంతో గుడిసెలు తొలిగించినా మిలిగిన శకలాలు,వంట సామగ్రి, మంచాలు ఆదార్ కార్డు, రేషన్ కార్డు వంటి డాక్యుమెంట్ లు, దుస్తులను నిప్పు పెట్టారు. దీంతో అవి కాలి బూడిద అయ్యాయి. తమ విలువైన వస్తువులు గుడిసెలలో ఉన్నాయని వాటికి నిప్పు పెట్టడంతో నష్టం వాటిల్లిందని పేదలు వాపోయారు. గుడిసెలు వేసుకోవడానికి సుమారు రూ. 5 వేలు ఖర్చు వచ్చిందని అలాగే వంట సామాగ్రి, గృహ ఉపకరనాలకు మరో రూ. 15 వేలు మొత్తం రూ.20 వేలు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం అరెస్టయిన కారణంగా శుక్రవారం తమ వస్తువులను తీసుకుందాం అని భావించామని అయితే ఉదయం వచ్చే సరికి మొత్తం కాల్చి బూడిద చేశారనిఅన్నారు. నిప్పు పెట్టి బూడిద చేసిన రెవెన్యూ, పోలీస్ అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడంతో పాటు నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు.



నిప్పుపెట్టడంతో కాలిపోయిన పేదల గుడిసెలు

సమస్యను పరిష్కరించాలని చెబుతున్నాం...

గత 20 రోజులుగా ఇళ్ల స్థలాలు పేదలకు ఇచ్చి, ఆ సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు చెబుతూనే ఉన్నాం. తహశీల్దార్ స్థల పరిశీలన చేస్తున్నామని చెబుతున్నారు. పరిశీలన పూర్తయిన వెంటనే పట్టాలు ఇస్తామని చెబుతున్నారు. సాంకేతిక సమస్యల వల్ల ఆలస్యం అవుతోందని వారు చెబుతున్నారు. పార్టీ పెద్దలతో మాట్లాడి ఈ సమస్యకు పరిష్కారం చూపి, పేదలకు న్యాయం చేస్తాం.

పురుషోత్తమ రెడ్డి,
ఎంపిపి.

పట్టాలు ఇచ్చేదాకా పోరాటం

పేదలకు ఇళ్ల స్థలాలు చూపి పట్టాలు ఇచ్చేంత వరుకు పోరాటం కొనసాగుతుంది. ఈ సమస్యపై ఈ రోజు జాయింట్ కలెక్టర్‌తో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో సమస్య పరిష్కారం అయితే సరే, లేకుంటే అదే స్థలంలో గుడిసెలు వేసి ఆందోళన కొనసాగిస్తాం. అధికారులు నిర్లక్ష్య ధోరణి విడనాడి పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలి.

ప్రవీణ్ కుమార్,
వ్యకాసం జిల్లా అధ్యక్షుడు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం : సిపిఎం

ప్రజాశక్తి - బుక్కపట్నం

సమస్యల పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలో సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి బ్యాళ్ల అంజి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న కొత్తచెరువు బుక్కపట్నం అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. అదేవిధంగా వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బుక్కపట్నం మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం అసంపూర్తిగా నిలిచిపోయినప్పటికీ స్థానిక నాయకుల్లో చలనం లేదని విమర్శించారు. ఉపాధి అవకాశాలు లేక కూలీలు ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారని ఈ సమస్యను పలు మార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఇఎస్ వెంకటేష్, నాయకులు ముత్యాలు, తిరుపాలు, అనసూయమ్మ, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు మౌలిక వసతులు కల్పించాలి

రాష్ట్ర వాణిజ్య పారిశ్రామిక అభివృద్ధి శాఖ సెక్రటరీ ఎన్.యువరాజ్

ప్రజాశక్తి -పెనుకొండ

కియా అనుబంధ రంగ కంపెనీల్లో పనిచేసే కార్మికుల మౌలిక వసతులపై ప్రణాళికలు చేపట్టాలని రాష్ట్ర వాణిజ్య పారిశ్రామిక అభివద్ధి శాఖ సెక్రెటరీ ఎన్. యువరాజు పేర్కొన్నారు. కియా అనుబంధ రంగాల కంపెనీల్లో శుక్రవారం నాడు కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్ఎల్‌పి ప్రతినిధి ఆనంద భాస్కర్, వెంకటే శం, తేజస్వినితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎపిఐసిసికి అనుబంధ రంగాల సైట్ బిలో మౌలిక వసతులపై మ్యాప్‌ను పరిశీలించారు. అక్కడ త్వరితగతిన నీరు ఉండే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం గుడిపల్లిలోని ఎస్ఎల్‌పి కర్మాగారంలో కియా అనుబంధ రంగ కంపెనీని పరిశీలించారు. కారు విడిభాగాలు లైట్లు సంబంధించిన విడిభాగాలు ఎలా తయారవుతున్నాయో పరిశీలించారు. కార్మికుల సంక్షేమం, మౌలిక వసతులు, పాఠశాల, ఆసుపత్రి నిర్మాణంపై ఆరా తీశారు. మౌలిక వసతులపై ప్రణాళికలు వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జిఎం చాంద్‌బాషా, ఏపీఐసీసీ సోనీ, నాగభూషణం సంబంధిత పరిశ్రమల శాఖ అధికారులు, పాల్గొన్నారు.




కార్మికుల మౌలిక వసతులపై అధికారులతో చర్చిస్తున్న యువరాజ్

పూలేపల్లిలో గంజాయి సాగు


ధ్వంసం చేసిన పోలీసులు

ప్రజాశక్తి-మడకశిర

అగళి మండల పరిధిలోని పూలేపల్లి గ్రామంలో ఓ వ్యక్తి తన పొలంలో గంజాయి మొక్కలు పెంచుతు న్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం సిఐ సురేష్‌బాబు, ఎస్ఐ లావణ్య సిబ్బందితో వెళ్లి గంజాయి మొక్క లను తొలగించారు. అర్ధ కిలోకి పైగా గంజాయి ఆకులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే మొక్కలు పెంచుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకు న్నట్లు సమాచారం. దీనిపై సిఐ, ఎస్ఐలు మాట్లాడుతూ నియోజకవర్గంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, మాదక ద్రవ్యాలను రవాణా చేస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. పట్టణంలో ఆకతాయి యువకులు గంజాయికు బానిసై అనారోగ్యం పాలయ్యారని వారు తెలిపారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.



గంజాయి సాగు చేసిన పంట పొలాన్ని పరిశీలిస్తున్న సిఐ సురేష్‌బాబు, ఎస్ఐ లావణ్య, పోలీసులు



సబ్సిడీ పప్పుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

సబ్సిడీ విత్తన పప్పుశనగ పంపిణీ ప్రారంభం

ప్రజాశక్తి-రొద్దం

మండల కేంద్రంతో పాటు వివిధ సచివాలయాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో శుక్రవారం రైతులకు సబ్సిడీపై విత్తన పప్పుశనగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాల యంలో సబ్సిడీ విత్తన పప్పుశనగ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శంకరనారాయణ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి నుంచి సబ్సిడీ విత్తన పప్పుశనగను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ నివేదిత, ఎఇఒ అంజాద్, వ్యవసాయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని మార్కెట్ యార్డులో పని చేస్తున్న ఈశ్వరమ్మ, శ్రీరాములు తమ తండ్రి నరసింహప్ప వర్ధంతి సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని ఆమిదాల గొంది వెంకటేశ్వర వృద్ధాశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శ్రీరాములు కుటుంబ సభ్యులు రాజశేఖర్, అఖిల్, నాగేంద్ర, ఆశ్రమం నిర్వాహకులు తిమ్మారెడ్డి పాల్గొన్నారు.



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో ముందుకుసాగాలి

తుముకూరు ఎస్పీ అశోక్, కమిషనర్ అశ్విజ, రఘువీరా

ప్రజాశక్తి మడకశిర

విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో జీవితంలో ముందుకెళ్లాలని కర్నాటకలోని తుమకూరు జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అశ్విజ సూచించారు. మండల పరిధిలోని నీలకంఠాపురం ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మాజీ ఎంపి దివంగత శ్రీరామరెడ్డి జయంతి సభకు అశోక్, అశ్విజ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా శ్రీరామరెడ్డి సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ప్రాంతం అభివృద్ధికి శ్రీరామరెడ్డితో పాటు రఘువీరారెడ్డి ఎంతో కృషి చేశారని కొనియాడారు. శ్రీరామిరెడ్డి జయంతి సందర్భంగా విద్యార్థులకు క్రికెట్ పోటీలు నిర్వహించడం, రైతులకు అవార్డులు ఇవ్వడం హర్షణీయమన్నారు. గతేడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. శ్రీరామరెడ్డి జయంతి సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా పాఠశాలల స్థాయిలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతగా నిలిచిన గుండమల ఎంజెపి పాఠశాల జట్టుకు విన్నర్స్ ట్రోఫీ, హరేసముద్రం జట్టుకు రన్నర్స్ ట్రోఫీ అందజేశారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులకు సైతం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గోవిందపురం, గంగలవాయిపాలెం గ్రామాల్లో పంటలు సాగు చేసి అత్యధిక దిగుబడులు సాధించిన రైతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్, కెటి శ్రీధర్, నరసింహమూర్తి, ప్రభాకర్ రెడ్డి, ఎంఇఒ శ్రీధర్, నాయకులు ఈశ్వరప్ప, నాగభూషణం, మందలపల్లి నాగరాజు, వరదరాజు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీ ప్రదానం చేస్తున్న తుమకూరు ఎస్పీ అశోక్, కమిషనర్ అశ్విజ, సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి

‘ఎందుకు జగనే కావాలి’పై అవగాహన

ప్రజాశక్తి-రొద్దం

ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలి అనే కార్యక్రమంపై శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎమ్మెల్యే శంకరనారాయణ అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ నుంచి ‘ఎందుకు ఆంధ్రకి జగనే కావాలి’ అనే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అందులో భా గంగా ప్రతి ఒక్కరినీ కలిసి 2019లో ఇతర పార్టీలు ఇచ్చిన హామీలు, వైసిపి ఇచ్చిన హామీల్లో తేడాలు, గత ప్రభు త్వంలో జరిగిన లోపాలు, జగన్ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించాల న్నారు. ప్రధానంగా భవిష్యత్తు తరాలకు జగన్ నాయకత్వం అవసరాన్ని గుర్తు చేస్తూ, ‘ఎపి ఇంకా అభివృద్ధి చెందాలన్నా, అందరూ బాగుపడాలన్నా ఎవరు కావాలి’? అనే ప్రత్యేకమైన సర్వేపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వైసిపి ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, సచివాలయ కన్వీనర్లు, జెసిఎస్ ఇన్‌ఛార్జులు, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర సిఎం మళ్లీ జగనే : ఎమ్మెల్యే

సోమందేపల్లి : ఎపికి మళ్లీ జగనే సిఎం అని ఎమ్మెల్యే శంకరనారాయణ ధీమా వ్యక్తం చేశారు. స్థానిక లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన జెసిఎస్ శిక్షణ శిబిరానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త మరింత కష్టపడి మళ్లీ జగన్‌ను సిఎం చేసుకుందామన్నారు. ‘ఆపు బాబు నాటకం–జగనే మా నమ్మకం’ నినాదంతో ముందుకెళ్దాం అన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో ఎంపిపి గంగమ్మ వెంకటరత్నం, జడ్పిటిసి డిసి.అశోక్, కన్వీనర్ నారాయణరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు రఫిక్, సేవాదళ్ అధ్యక్షుడు వేణు, సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, పాల్గొన్నారు.



సోమందేపల్లిలో కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

కళ్యాణమండపం నిర్మాణానికి రూ. 5 లక్షల విరాళం

ప్రజాశక్తి-మడకశిర

రొళ్ల మండల పరిధిలోని కాల్వేపల్లి గ్రామంలో లక్ష్మీ రంగనాథ స్వామి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కళ్యాణ మండపానికి శుక్రవారం మండల పరిధిలోని హెచ్‌టి పల్లి గ్రామానికి చెందిన మైత్రమ్మ, బండి రంగప్ప కుటుంబ సభ్యులు రూ. 5 లక్షల విరాళాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ నిర్వాహకులు రాజన్న, కాంతరాజు, శ్రీరంగప్ప, రమేష్, రామేగౌడ్, ఎస్.తిమ్మప్ప కృతజ్ఞతలు తెలిపారు.



కళ్యాణ మండపం నిర్మాణానికి రూ. 5 లక్షల విరాళం అందజేస్తున్న దాతలు

సగానికి సగమే..!

◆ టిబి డ్యామ్‌లో గతేడాది ఫుల్...ఈ ఏడాది హాఫ్..

◆ హెచ్‌ఎల్‌ఎంసికి సగం కంటే తక్కువే

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



నిత్యం కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లాకు ప్రధానమైన సాగునీటి వనరుగా తుంగభద్ర డ్యామ్ ఉంది. ఆ డ్యామ్ నుంచే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా జిల్లాకు నీరొస్తుంది. అదే సాగు, తాగునీటి అవసరాలనే తీర్చే ఏకైక వనరుగానుంది. ఈ ఏడాది తుంగభద్ర డ్యామ్‌కు నీరు ఆశించినంత రాలేదు. సాధారణంగా ఆగస్టు, సెప్టంబర్ మాసాల్లోనే ఈ డ్యామ్‌కు నీరు పుష్కలంగా వచ్చేది. ఈసారి తుంగభద్ర ఎగువ భాగంలో వర్షాలు ఆశించినంత రాకపోవడంతో డ్యామ్ కూడా నీరు చాలా తక్కువగా వచ్చింది. దీంతో డ్యామ్ కిందనున్న కాలువలకు నీటి కేటాయింపులు తగ్గిపోయాయి.

సగానికి సగమే..

గతేడాది ఇదే సమయానికి తుంగభద్ర డ్యామ్‌కు 536.20 టిఎంసిల నీరు వచ్చింది. జూన్ నుంచి అక్టోబరు నాటికి వచ్చింది. దీంతో గేట్లు ఎత్తి పలుమార్లు నీటిని నదిలోకి వదిలారు. ఇంత పెద్దఎత్తున నీరు రావడంతో ఇదే సమయానికి డ్యామ్ కూడా నిండుకుండలాగా తొనకిసలాడుతూ ఉంది. పూర్తి సామర్థ్యంతో 105.79 టిఎంసిల నీరు ఉంది. ఇన్‌ఫ్లస్ కూడా ఈ సమయానికి 23,727 క్యూసెక్కులుండేవి. ఇప్పుడు చూస్తే అక్టోబర్ ఆరవ తేదీ నాటికి డ్యామ్‌లో నీటి మట్టం కేవలం 52.73 టిఎంసిలే ఉంది. 4437 క్యూసెక్కులు మాత్రమే ఇన్‌ఫ్లోస్ ఉన్నాయి. ఇక తుంగభద్ర ఎగువ భాగం పెద్దగా వర్షాలొచ్చే పరిస్థితి కనిపించడం లేదు. జూన్ నుంచి ఇప్పటి వరకు వచ్చిన నీరే 106 టిఎంసిలు ఉన్నాయి. ఈ నీటిని ఇప్పటికే వినియోగించుకుంటూ ఉండటంతో సగం తగ్గిపోయాయి. ఈ ప్రభావం దిగువనున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, దిగువ ప్రధాన కాలువలకు నీటి కేటాయింపుల్లోనూ కోత పడింది.

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు సగానికి కోతే...

తుంగభద్ర డ్యామ్‌లో నీటి లభ్యత తగ్గడంతో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీటి కేటాయింపుల్లో కోతపడింది. జూన్‌లో వేసిన అంచనాల ప్రకారం 26.828 టిఎంసిల నీరు వస్తుందనుకున్నారు. తాజా అంచనాల ప్రకారం అది 16 టిఎంసిలకే పడిపోయింది. గతేడాదితో పోలిస్తే సగం కంటే తక్కువే కావడం గమనార్హం. గతేడాది తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా జిల్లాకు వచ్చింది 36.50 టిఎంసిలు. ఈ ఏడాది 16 టిఎంసిలే కావడం గమనార్హం. అది కూడా గతేడాది కంటే తక్కువగా నీరు జిల్లాకు రానుంది. ఇది తాగునీటి అవసరాలకు సరిపోనుంది. ఈ నేపథ్యంలో నీరొస్తుందని ఆశించిన పంటలు సాగు చేసిన ఆయకట్టుకు రైతులకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఇదికూడా నవంబరు ఒకటికి నీటిని నిలిపివేసే సూచనలు కనిపిస్తుండటంతో ప్రధానంగా తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ రైతులు తీవ్రంగా నష్టపోయే సూచనలు కనిపిస్తున్నాయి.

కుశలవ కంపెనీ భూ రికార్డుల్లో గోల్‌మాల్..!



హిందూపురం తహశీల్దార్ కార్యాలయంలో రాత్రి సమయంలో సిబ్బందితో కలిసి ఉన్న లేపాక్షి తహశీల్దార్ కె బాబు

ప్రజాశక్తి-హిందూపురం

తమ పేరిట ఉన్న భూములు అక్రమంగా కుశలవ ఆర్గానిక్ ఉత్పత్తుల కంపెనీకి అధికారులు కట్టబెట్టారని,రికార్డుల్లో ఇప్పటకి తమ పేర్లే ఉన్నాయని, తమ భూములు తమకు ఇవ్వాలంటు సిపిఎం, కెవిపిఎస్ సహకారంతో లేపాక్షి మండలం కొండూరు, కొర్లకుంట తదితర గ్రామాలకు చెందిన దళిత రైతులు అనేక రోజులుగా పోరాటాలు చేస్తున్నారు. లేపాక్షి తహశీల్దార్ కార్యాయలం ఎదుట శిబిరాన్ని ఏర్పాటు చేసి కొన్ని నెలల పాటు రీలే నిరాహార దీక్షలు చేశారు. అయితే పేదలకు అండగా నిలవాల్సిన అధికారులు కుశలవ కంపెనీకి గులాములుగా మారారు. ఇది చాలదన్నట్లు దళిత రైతుల పేరులో ఉన్నా పాత రికార్డులను తారుమారు చేస్తున్నారు. ఈ గోల్‌మాల్‌కు హిందూపురం తహశీల్దార్ కార్యాలయాన్ని వేదికగా మార్చుకున్నారు. రాత్రి కాగానే లేపాక్షి తహశీల్దార్‌తో పాటు కార్యలయ సిబ్బంది ఇక్కడికి వచ్చి రాత్రి పొద్దుపోయేదాక రికార్డులను తారుమారు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సొంత కార్యాలయాన్ని వదలి హిందూపురంలో రాత్రి పూట పని చేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తున్నాయి, అక్రమాల కోసమే ఈతంతు కొనసాగిస్తున్నట్లు విమర్శలు వినపిస్తున్నాయి.

లేపాక్షి మండలం కొండూరు గ్రామ రెవెన్యూ పొలంలో 1961 నుండి 2008 సంవత్సరాల మధ్యకాలంలో సుమారు 200 ఎకరాలు 80 మంది దళిత రైతులకు డి పట్టాలను ప్రభుత్వం మంజూరు చేసింది. డి పట్టాలను పొందిన రైతులు భూమిని చదును చేసుకుని, వ్యవసాయాన్ని చేసుకుంటు 40 సంవత్సరాలుగా జీవనం సాగిస్తున్నారు. అయితే 2015 నుండి 2019 సంవత్సరాల మధ్య కాలంలో దళిత రైతుల వద్దకు అప్పటి తహశీల్దార్, కుశవల ఆర్గానిక్ ప్రొడక్ట్స్ చైర్మెన్ సి. జె. రామకృష్ణప్రసాద్ వచ్చి కంపెనీకి భూములు ఇవ్వాలని కోరారు. ఇలా అయితే ఇక్కడే ఉపాది లభిస్తుందని,మీ భూముల్లో బోర్లు వేయించి పంటలు పండిస్తామని, ఎకరాకు రూ.1లక్ష చోప్పున 20 సంవత్సరాలకు రూ.20లక్షలు ఇస్తామని నమ్మించారు. నిరక్ష్యరాస్యులైన దళిత రైతుల నుంచి అప్పటికే సిద్ధం చేసిన పత్రాల్లో సంతకాలు చేయించుకున్నారు. సంతకాలు రాని వారి నుంచి వేలి ముద్రలు తీసుకోవడమే కాకుండా ఫోటోలను తీసుకున్నారు. ఒక సంవత్సరం పాటు వారి భూముల్లో కొంత మందికి పనులు కల్పించారు. అయితే సంవత్సరానికి ఇస్తామన్నా రూ.1లక్ష ఇవ్వలేదు. దళిత రైతులను కంపెని చుట్టూ తిప్పుకున్నారు. చివరకు వారు తమకు ఇస్తామన్నా డబ్బులు ఇవ్వాలని నిలదీయడంతో అసలు విషయం బయటపెట్టారు. రైతుల నుంచి తాము భూములుకొన్నట్లు పత్రాలను చూపించారు. దీంతో అందరం మోసం పోయినట్లు గ్రహించారు. కొంత మంది భూములు వారి పేరుతో ఉన్నాయని, కొంత మంది భూములు కుశలవ కంపెనీ ఛైర్మన్ పేరుమీద ఉన్నాయని గుర్తించారు. ఈ తతంగం అంత అప్పటి తహశీల్దార్, చిలమత్తూరు సబ్ రిజిస్టర్‌కలిసి దళిత భూములను వారి ప్రమేయం లేకుండానే కంపెనీ చైర్మేన్ పేరుతో రిజిస్టర్ చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయం తెలిసినప్పటి నుంచి దళితులు ఎన్నో పోరాటాలను చేశారు. అయినప్పటికి అధికారులు ఎవరు దళితుల పక్కన నిలబడలేదు. ప్రస్తుతం ఉన్నా తహశీల్దార్ కె బాబుకు దళిత రైతులు వెళ్లి తమకు న్యాయం చేయాలని కోరినప్పటికి అతను సైతం స్పందించలేదు. 1బి, అడంగళ్ రైతుల పేరున ఉన్నప్పటికి భూముల్లో మీరు వెళితే కేసులు నమోదు చేస్తామని బెదరింపులకు పాల్పడ్డారు. దీంతో అందరు కలిసి న్యాయం కోసం ఎస్‌సి కార్పోరేషన్‌ను ఆశ్రయించారు. దీంతో అక్కడి నుంచి జిల్లా కలెక్టర్, లేపాక్షి తహశీల్దార్‌కు నోటీసులు వచ్చాయి. అయినప్పటికి చట్టాలను తుంగలో తొక్కి భూ కబ్జాదారులకు రెవెన్యూ అధికారులు పూర్తిగ సహకరిస్తున్నారన్నా ఆరోపణలు వినపిస్తున్నాయి. 2007 చట్టం ప్రకారం అసైన్డ్ భూములను నిజమైన వారసులకు ఇవ్వాలని ఉన్నప్పటికి వారికి ఇవ్వకుండా స్థానిక రెవిన్యూ అధికారులు కావాలనే నిజమైన హక్కుదారులకు అన్యాయం చేస్తున్నారు.

కుశలవ భూ ఆక్రమణలు ఆపాలి : ప్రభుత్వ అసైన్డ్ భూములను నిజమైన హక్కుదారులకే ఇవ్వాలని డిమాండ్ చేస్తు సిపిఎం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో దళిత రైతులు భూ పోరాటం చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు వారి భూముల్లోకి వెళ్లి భూమిని చదును చేసుకుంటున్నారు. ఈ విషయం తెలియడంతో కంపెని వారితో కుమ్మక్కు అయిన తహశీల్దార్ దళితులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. భూ పోరాటం సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతు అసైన్మెంట్ చట్టం 9/ 77 ప్రకారం పేదల భూములు పేదలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో అధికారుల వైఖరి మార్చుకోవాలన్నారు.

రీ సర్వే పేరుతో రికార్డుల్లో మార్పులు

హిందూపురం తహశీల్దార్ కార్యాలయంలో లేపాక్షి తహశీల్దార్ బాబు రీసర్వే పేరుతో రికార్డుల్లో మార్పు చేస్తున్నట్లు ఆరోపణలు వినపడుతున్నాయి. రీ సర్వే పేరుతో మండలంలోని కొండూరు, సిరివరం, చోళ సముద్రం తదితర పంచాయతీలకు సంబంధించిన గ్రామాల భూ రికార్డులను మార్పులు చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సొంత కార్యాలయంలో ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోనే పూర్తి స్థాయిలో విధులు నిర్వహించని అధికారులు, సిబ్బంది ఇతర మండల కార్యాలయంలో, ఆ మండలానికి సంబంధించిన అధికారులు, సిబ్బంది లేని సమయంలో భూ రికార్డులు వన్ బి, ముటేషన్ తదితర దరఖాస్తులను ముందర వేసుకొని రాత్రి సమయంలో రికార్డులను మార్పులు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కొండూరు సమీపంలో ఉన్నా కుశలవ భూముల రికార్డుల మార్పులు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో అధికారులు భూ రికార్డుల్లో పెద్ద ఎత్తున మార్పులు చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో తహశీల్దార్ బాబును ప్రశ్నించగా రీ సర్వే పనులు చేస్తున్నామని చెప్పారు. ఫోటోలు తీయగానే అక్కడి నుంచి అందరూ కార్యాలయానికి తాళాలు వేసుకుని వెళ్ళిపోయారు. ఈ విషయంలో సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టి నిజమైన భూహక్కుదారులకు భూములు అప్పగించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నల్లచెరువు ఎస్‌ఐగా లింగన్న

నల్లచెరువు : నల్లచెరువు ఎస్ఐగా లింగన్న శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా మండలకేంద్రంలోని భగత్ సింగ్ ఆటోయూనియన్ అధ్యక్షులు ఖాజా ఆద్వర్యంలో ఎస్ఐను సన్మానించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చిత్రావతి హారతిఘాట్‌కు హంస వాహనం

పుట్టపర్తి రూరల్: కోనసీమ జిల్లా సాయి భక్తుల సత్య సాయి హంస వాహనం శుక్రవారం చిత్రావతి హారతి ఘాట్‌కు చేరుకుంది .ఈనెల 8న సాయంత్రం 6 గంటల నుండి 8:30 గంటల వరకు హంస వాహనంపై శ్రీ సత్య సాయి బాబు చిత్రపటాన్ని ఉంచి తెప్పోత్సవం నిర్వహిస్తారు. వందలాదిమంది కోనసీమ జిల్లా సాయి భక్తులు పర్తియాత్రగా ఇక్కడికి విచ్చేసి తెప్పోత్సవం నిర్వహిస్తారు. దేశ విదేశీ, సాయి భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

అవుట్‌సోర్సింగ్ జిల్లా కమిటీ ఏర్పాటు

ధర్మవరం టౌన్ : మున్సిపల్ ఇంజనీరింగ్ అవుట్ సోర్సింగ్ సత్య సాయి జిల్లా నూతన కమిటిని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు నాగభూషణం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షులుగా బొగ్గు నాగరాజు(ధర్మవరం), ఉపాధ్యక్షులుగా అనిల్(ధర్మవరం), రామదాసు(పుట్టపర్తి), ప్రధానకార్యదర్శిగా గణేశ్ (పుట్టపర్తి), సహాయ కార్యదర్శులుగా యోగేశ్, రమేశ్(ధర్మవరం), సభ్యులుగా ధర్మవరం మున్సిపాలిటీ నుండి ఆద్రామహేశ్, కాటమయ్య చౌడప్ప, నరేంద్రరెడ్డి, వరదరాజులు, పుట్టపర్తి మున్సిపాలిటీ నుండి సురేంద్ర, హుస్సేన్, నాగరాజు, పోతలయ్య, పెద్దన్నను ఎంపికచేశారు.

మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు

కదిరి టౌన్ : హస్తకళల ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు శుభశ్రీ శారీ ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ యశోద పేర్కొన్నారు. శుక్రవారం కదిరి పట్టణంలోని దత్త ఫంక్షన్ హాల్ నందు హస్తకళలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐసిఐసిఐ బ్యాంకు మేనేజర్ ఖాజా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హస్తకళ అభివృద్ధి ఢిల్లీ వారి సౌజన్యంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిజైనర్ రాజేష్, ఎస్వీ రెడ్డి, నస్రిన్ భాను, జస్వంత్, క్లస్టర్ మేనేజర్ అలీ, లేపాక్షి ఎంపోరియం మేనేజర్ శ్రీనివాసులు, సుజాత, నిర్మల పాల్గొన్నారు.

కంచుకోటను బద్దలు కొడదాం

హిందూపురం : టిడిపి కంచుకోట హిందూపురంలో వైసిపి జెండా ఎగర వేద్దాం అని బి బ్లాక్ కన్వీనర్ నరేష్ అన్నారు. ఇటీవల బి బ్లాక్ కన్వీనర్‌గా వైసిపి నియమించిన నరేష్‌ను శ్రీకంతపురంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, వెంకటేష్, సోమశేఖర్, మంజుళ, పోస్టల్ అశ్వర్థప్ప, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రవాణాకు ఇబ్బందులు కలిగించొద్దు

బత్తలపల్లి : వివిధ పట్టణాలకు వెళ్లే వారికి ప్రధాన కూడలిలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలిగించకుండా వ్యాపారులు సహకరించాలని ఎస్ఐ పి. శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం సాయంత్రం బత్తలపల్లి కూడలిలో వ్యాపారాలు నిర్వహించుకునే చిరువ్యాపారులు, ఆటో డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. వ్యాపారాలు నిర్వహించుకునేవారికి తాము సహకరిస్తామని అయితే వారు కూడా తాము చెప్పినవిధంగా సహకారమివ్వాలని సూచించారు. లేనిపక్షంలో జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

ఓడిసి ఎస్‌ఐగా మల్లికార్జునరెడ్డి

ఓబుల దేవర చెరువు : ఓబుళదేవరచెరువు ఎస్ఐగా మల్లికార్జున రెడ్డి శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ గోపి విఆర్ వెళ్లడంతో ఆయన స్థానంలో మల్లిఖార్జునరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతు మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

మృతునికి నివాళి

పుట్టపర్తి క్రైమ్ : మండల కేంద్రంలోని అమగొండపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచి వెంకట రెడ్డి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి వారి స్వగ్రామానికి వెళ్లి వెంకటరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

డయల్ యువర్ డిఎమ్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఆర్టీసీ డిపోలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి ఆరు గంటల వరకు డిపో మేనేజర్ ఇనయతుల్లా నిర్వహించిన కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. ఆమడగూరు, కొక్కంటి క్రాస్ మీదుగా మదనపల్లికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని లక్ష్మణ్ రావు అనే ప్రయాణికుడు కోరాడు. అదేవిధంగా పుట్టపర్తి నుంచి కదిరి పులివెందుల మార్కాపురం మీదుగా శ్రీశైలం వరకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కరావులపల్లి కి చెందిన ప్రభాకర్ రెడ్డి ఫోన్ లో కోరారు. అదేవిధంగా పుట్టపర్తి నుంచి తిమ్మమ్మ మర్రిమాను, కటారుపల్లి యోగి వేమన సమాధికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని రమణ రెడ్డి అనే ప్రయాణికుడు కోరారు. వీటన్నింటి పై స్పందించిన డిపో మేనేజర్ మాట్లాడుతూ ప్రయాణికుల కోరిక మేరకు బస్సులు నడపడానికి కృషి చేస్తామని అన్నారు.

కదిరి టౌన్ : కదిరి డిపో పరిధిలోని గ్రామీణ ప్రాంతాలకు పల్లె వెలుగు బస్సుల సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కదిరి డిపో మేనేజరు మైనోద్దీన్ తెలిపారు. డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రము 4 నుండి 5 గంటల వరకు ఆఫీసులో నిర్వహించారు. ఈ సందర్భముగా అమడగూరుకు చెందిన లక్ష్మీనారాయణ, రామచంద్రరావు సమస్యలను తెలియజేసారు. అమడగూరుకు సెలవు రోజులలో కూడ స్కూల్ బస్సులు ప్రయాణీకుల సౌకర్యార్థము నడపాలని కోరారు. కదిరి నుండి కదిరి పాత సర్వీసు ఒడిసి, అమడగూరు, కొక్కంటి క్రాస్ మీదుగా కదిరికి నడపాలన్నారు. చినగాని పల్లికి , అమడగూరు నుండి నేరుగా పుట్టపర్తికి బస్సులు నడపాలని కోరారు. బెంగూళూరు మార్తన హల్లికి ఉదయం: 9.30 కి కదిరి నుండి బస్సు నడపాలని రంగనాయకులు కోరారు.

ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ప్రజాశక్తి బుక్కపట్నం

గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని నైపుణ్యతను వెలికి తీసి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు వైసిపి యువ నాయకులు కొత్తకోట చక్రధర్ రెడ్డి తెలిపారు. వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు కొత్తకోట సోమ శేఖర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన క్రికెట్ పోటీల్లో భాగంగా శుక్రవారం మండల స్థాయి ఫైనల్ పోటీలు నిర్వహించారు. ఈ ఫైనల్ పోటీలలో అగ్రహారం, ధూపం పల్లి జట్లు తలపడగా అగ్రహారం జట్టు మండల స్థాయి విజేతగా నిలిచింది. విజేతకు 15 వేల రూపాయల నగదు ట్రోఫీ, రెండో స్థానంలో నిలిచిన ధూపం పల్లి జట్టుకు పదివేల రూపాయల్లో నగదు తో పాటు ట్రోఫీ అందించారు. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులు నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రవణ్ కుమార్, చంద్రారెడ్డి, మల్లేష్, డీలర్ చిన్నోడు, సురేంద్ర, నరసింహారెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో వైసిపి నాయకులు చక్రధర్ రెడ్డి



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

అభివృద్ధి, సంక్షేమమే జగనన్న లక్ష్యం

ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 17వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వార్డులోని ఇంటింటికి తిరుగుతు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నీలూరి వెంకటరాముడు, చందమూరి నారాయణరెడ్డి. మాసపల్లి సాయికుమార్, పెనుజూరి నాగరాజు, బ్రహ్మయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డితో పాటు ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుంటే అక్కడే గుడిసెలు వేస్తాం

ప్రజాశక్తి - చిలమత్తూరు

పేదలకు ఇంటిస్థలాలు ఇవ్వకుంటే అక్కడే గుడిసెలు వేస్తామని సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని సిపిఎం నాయకులు హెచ్చరించారు. సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్, అధ్యక్షులు లక్ష్మినారాయణ, పైపల్లి గంగాధర్ ఆధ్వర్యంలో పేదలు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం ముందు శాంతి యుతంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికి ఇంటి స్థలాలు చూపి పట్టాలు ఇస్తామని జాయింట్ కలెక్టర్ తో చర్చలు జరిపి సమస్యను పరిష్కరిస్తామని తహశీల్దార్ ఇచ్చిన హామీ మేరకు తాము శాంతియుతంగా ఆందోళన చేస్తున్నామని అన్నారు. అయితే శనివారం జరిగే చర్చల్లో సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పేదలు ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులకు పేదలంటే లెక్క లేదని కాబట్టే గుడిసెలు పీకేశారని విమర్శించారు. జాయింట్ కలెక్టర్ వద్ద చర్చల అనంతరం తమ వైఖరి ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో కమిటీ సభ్యులు శివ, రహంతుల్లా, చందు, రియాజ్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు లక్ష్మినారాయణ

వైద్య విధానంలో విప్లవాత్మక మార్పులు



సమావేశంలో మాట్లాడుతున్న కదిరి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి



మహిళకు కంటిఅద్దాలు అందజేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి కదిరి అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వైద్యవిధానంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారని స్థానిక ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని నిజాంవలి కాలనీ వార్డు సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వైద్య విధానంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. జగనన్న ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, వైద్య సిబ్బంది, ప్రభుత్వ సిబ్బంది, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : అన్ని వర్గాల వారికి చక్కటి ఆరోగ్యాన్ని ప్రసాదించడమే ప్రభుత్వ లక్ష్యమనిఅని మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి,మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని సుందరయ్య నగర్ లో గల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈకార్యక్రమంలో రాజేంద్రనగర్, పార్ధసారధి నగర్, సుందరయ్య నగర్, దుర్గా నగర్- 1, దుర్గా నగర్- 2 నుండి వందలాదిమంది ప్రజలు వైద్యసేవలు పొందారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఓ సాల్వియసాల్మన్, వైస్ చైర్మన్ షంషాద్ బేగం, కంటి ఆప్తాలమిక్ వైద్యులు ఉరుకుందప్ప, వైద్యులు చంద్రిక, గౌతమి, శ్వేత, ప్రియాంక, ప్రత్యేక వైద్య నిపుణులు ప్రసాద్ రెడ్డి, నీరజ, సురేష్ నాయక్, కౌన్సిలర్లు గోరకాటి పురుషోత్తం రెడ్డి, రమాదేవి, బాలం ఓబులమ్మ, కోటిరెడ్డి సుజాత, రమణమ్మ, వైఎస్‌ఆర్‌సిపి నాయకులు కోటిరెడ్డిబాల్ రెడి , చాంద్‌బాషా, తోపుదుర్తి వెంకట రాముడు,కత్తే పెద్దన్న, బాలంగోపాల్, వైసిపి విద్యార్థి విభాగం అమర్నాథ్ రెడ్డి, ఆశా కార్యకర్తలు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలంలోని దొరిగల్లు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అధికారులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వైద్య సేవల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రాజేంద్ర ,నాగేంద్ర నాయక్, సర్పంచి రాణి , మండల సీనియర్ నాయకులు ఇందుకూరు నారాయణరెడ్డి, జెడ్పీటీసీ తిరుమల సేవే నాయక్, వైస్ ఎంపీపీ కృష్ణమ్మ వెంకటేశ్వర్ రెడ్డి, చంద్ర, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : పేదల ఇంటి వద్దకే వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం మండల పరిధిలోని వేపరాల సచివాలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి జగనన్న ఆరోగ్యసురక్ష పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రామ్మోహన్, ఎంపీడీవో రామా నాయక్, వైద్య అధికారులు మహేశ్వర్ మారుతి ప్రసాద్, ఫక్రుద్దీన్, ఎంపీపీ జగన్మోహన్, వైసీపీ మండల కన్వీనర్ జి రవీంద్ర రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు ఎస్ ఫయాజ్ అలీ తదితరులు పాల్గొన్నారు

కొత్తచెరువు : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ రామాంజనేయరెడ్డి, ఎంపీడీవో బారాన్ సాబ్ తెలిపారు మండల పరిధిలోని బైరాపురం గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పంచాయతీలోని మూడు గ్రామాల ప్రజలకు వైద్య చికిత్సలు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివరాం, గ్రామ సర్పంచి రవికుమార్, వైస్ ఎంపీపీ గంగరాజు, కార్యదర్శి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గొర్రెలు అపహరణ

ఓబులదేవరచెరువు : మండలంలోని వంచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శిరగం గంగిరెడ్డి గొర్రెలు చోరీకి గురయ్యాయి. గంగిరెడ్డికి చెందిన గొర్రెల దొడ్డిలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి 27 గొర్రెలను అపహరించుకుపోయినట్లు బాధితుడు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. వీటి విలువ సుమారు రెండు లక్షల వరకు ఉంటుందని భాధిత గొర్రెల యజమాని గంగిరెడ్డి వాపోయాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటరమణ తెలిపారు.

పొలంలో విద్యుత్‌సామగ్రి ధ్వంసం

పరిగి : మండలంలోని బీచిగానిపల్లి పంచాయతీ వంగపల్లి లో పాత కక్షలతో రైతు పొలంలోని విద్యుత్‌సామగ్రిని ధ్వంసం చేసిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. అందుకు సంబంధించిన వివరాలు... వంగలపల్లికి చెందిన ఆనంద్ రెడ్డి ఆదినారాయణ రెడ్డి మారుతి రెడ్డి పొలంలో వ్యవసాయ పనుల కోసం వేసిన బోరు బావి మోటరు స్టార్టర్లను గ్రామానికి చెందిన కొంతమంది దుండగులు అర్ధరాత్రి వేళలో పగలగొట్టారు. 15 రోజుల క్రితం కూడా ఇలాగే వ్యవహరిస్తే రూ.15వేలు ఖర్చు చేసి స్టాటర్లను రిపేర్ చేయించుకున్నామన్నారు. అయినప్పటికీ తమపై కొంతమంది దుండగులు పాత కక్షలతో ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని ఇప్పటికైనా స్థానిక పోలీసులు ఇలాంటి సంఘటనపై చర్యలు తీసుకోకపోతే తమలాంటి రైతులు నష్టపోతామని వెల్లడించారు. తమకు జరిగిన అన్యాయంపై పోలీఉలకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చిలమత్తూరు : మండల పరిదిలోని మరవకొత్తపల్లి క్రాస్ సమీపంలోని హిందూపురం ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో చిలమత్తూరుకి చెందిన శంకర్ రెడ్డి అనే వ్యక్తి గాయపడ్డారు. కొడికొండ చెక్‌పోస్టు వైపు నుండి చిలమత్తూరు వైపు ద్విచక్రవాహనంలో వస్తున్న శంకర్ రెడ్డికి కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి కింద పడ్డాడు. గాయపడిన వ్యక్తిని అంబులెన్స్ లో చిలమత్తూరు ఆసుపత్రి కి తరలించారు.

మహిళ ఆత్మహత్య

పుట్లూరు : మహిళా ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని ఏ.కొండాపురం గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఏ.కొండాపురం గ్రామానికి చెందిన కృష్ణవేణి (49) కొన్నేళ్ల క్రితం మృతిచెందాడు. ఉన్న కూతురుకు కూడా పెళ్లి కావడంతో వెళ్లిపోంది. దీంతో కొండాపురంలో ఒంటరిగా నివాసం ఉంటోంది. ఈనేపథ్యంలో కృష్ణవేణికి తరచూ కడుపునొప్పి వచ్చేంది. గురువారం రాత్రి కూడా కడుపునొప్పి విపరీతంగా రావడంతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కూతురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

డివిఎంసి సభ్యుడిగా పైపల్లి గంగాధర్

పుట్టపర్తి అర్బన్ : జిల్లా ఎస్సి, ఎస్టీ, విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా పైపల్లి గంగాధర్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన నియామక పత్రాన్ని శుక్రవారం అందుకున్నారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ ప్రజాసంఘాల తరపున తనను ఎంపిక చేసిన కలెక్టర్, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి వాటిని జిల్లా కమిటీ సమావేశంలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



పైపల్లి గంగాధర్

పోలీసులపై ప్రజల్లో నమ్మకం కలిగించండి : ఎస్పీ

పుట్టపర్తి రూరల్: ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం ఏర్పడే విధంగా పోలీస్ సేవలు అందించాలని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి తెలిపారు. ఒడిసి, అమడుగూరు ఎస్ఐలుగా బాధ్యతలు స్వీకరించిన మల్లిఖార్జునరెడ్డి, బలరాం శుక్రవారం ఎస్పీ చాంబర్లో ఎస్పీ మాధవ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న బలరాం, గాండ్లపెంటలో పనిచేస్తున్న మల్లికార్జురెడ్డి బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన వారు, ఎస్పీ ని కలిశారు. సమర్ధవంతంగా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని ఎస్పీ మాధవ్ రెడ్డి వారికి సూచించారు.

వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ బొగ్గు సురేష్

పుట్టపర్తి రూరల్: వైసిపి డాక్టర్ల రాష్ట్ర కమిటీ విభాగంలో డాక్టర్ బొగ్గు సురేష్‌కు చోటు దక్కింది. ఇందులో రాష్ట్రం నుండి నలుగురుకు చోటు లభించగా శ్రీ సత్యసాయి జిల్లా లో పుట్టపర్తి అల్ట్రా విజన్ కంటి ఆసుపత్రి డాక్టర్ బొగ్గు సురేష్ కు రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించినట్లు ఉన్నతాధికారుల నుండి సమాచారం అందింది. తన ఎంపిక పట్ల స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డికి, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. డాక్టర్ బొగ్గు సురేష్ గత ఐదు సంవత్సరాల నుండి పుట్టపర్తి నియోజకవర్గంలోనే కాక ఇతర నియోజకవర్గాల్లో సైతం ఉచిత కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఎంతోమంది వృద్ధులకు, యువకులకు, విద్యార్థులకు, కంటి వైద్య పరీక్షలు నిర్వహించి కంటి ఆపరేషన్లు నిర్వహించారు. అంతేకాక, పీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ మెడికల్ టెక్నాలజీ కళాశాలలో ఎంతో మంది విద్యార్థులకు ఉచితంగా విద్యాబోధన అందించారు. పుట్టపర్తి లోని అల్ట్రా విజన్ ఐ హాస్పిటల్ ద్వారా ఎంతోమంది పేద మధ్యతరగతి కుటుంబీకులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు అందించడమే కాక ఆపరేషన్లు సైతం నిర్వహించారు. ఈయన ఎంపిక పట్ల స్థానిక వైసీపీ నాయకులు, మైలారి నాగరాజు, దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడు నారాయణస్వామి, శ్రీనివాసులు, మిద్ది కేశవరెడ్డి, గోరంట్ల కమలాకర్,



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న జీవాలైన కోళ్లు, గొర్రెలు, మేకలు, పెంపకం చేస్తున్న లబ్ధిదారులకు 50 శాతం సబ్సిడీతో ఇస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక సాయి ఆరామంలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఆవుటాల రమణారెడ్డి అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లబ్ధిదారులకు సులభమైన పద్ధతుల ద్వారా బ్యాంకుల్లో రుణాలు అందించడానికి కషి చేస్తామని చిన్న జీవాల పెంపకానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం సబ్సిడీ అందిస్తుందని అన్నారు. వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమ పై చాలామంది రైతులు ఆధారపడ్డారని ఇది గమనించే 50 శాతం సబ్సిడీతో రుణాలు అందించడం జరుగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకొని తమ ఆదాయాన్ని పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భాగ్యరేఖ, పశుసంవర్ధక శాఖ అధికారి శుభ దాస్, ప్రత్యేక అధికారి రమణయ్య, లీడ్ బ్యాంకు మేనేజర్ రమణ కుమార్, కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి బాబు, జిల్లా గొర్రెల పెంపకం అధ్యక్షులు నరసింహ గౌడ్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ మాధవప్ప, మండలాల అగ్రి బోర్డు చైర్మన్లు, వైసిపి నాయకులు, పశు వైద్యాధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే వైద్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రొద్దం

'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ద్వారా వైసిపి ప్రభుత్వం ప్రజల వద్దకే వైద్యం అందస్తుందని ఎమ్మెల్యే శంకరనారాయణ పేర్కొన్నారు. మండల పరిధిలోని తురకలా పట్నం సచివాలయంలో శుక్రవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్, తహశీల్దార్ అనంతాచారి, అంగన్వాడీ సూపర్‌వైజర్ అనురాధ, ఎంపిపి చంద్రశేఖర్, రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ తిమ్మయ్య, డాక్టర్లు, ఎఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అధికార పునరుద్ధరణపై అవగాహన

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం సీసీ, గ్రామైక్య సంఘ ప్రతినిధులకు గ్రామ అధికార పునరుద్ధ రణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి ప్రణాళికలు తయారు చేసుకోవడం, హక్కులు, అర్హతలు, జీవనోపాధి ప్రణాళికలు, గ్రామ ఉమ్మడి ఆస్తులు, వనరులు, సౌకర్యాలు, వనరుల అభివృద్ధి ప్రణాళికలు, సామాజిక అభివృద్ధి ప్రణాళిక తయారు చేసుకోవడం, తదితర అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, ఇఒఆర్‌డి నాగరాజురావు, ఎపిఎం రామాంజ నేయులు, ఉపాధి హామీ ఎపిఒ అజామ్‌ఖాన్, మండల సమైక్య అధ్యక్షురాలు హరిత, సీసీలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.


పేకాటజూదరులు అరెస్టు

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండల కేంద్రంలోని పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకుని సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా ఇద్దరు జూదురులను అరెస్టు చేసినట్లు బత్తలపల్లి ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బత్తలపల్లిలోని ఇందిరమ్మ కాలనీలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. వెంటనే సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా ఇద్దరు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.6.400 నగదు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.







పెనుకొండలో 'బాబుతో నేను' కరపత్రాలను పంపిణీ చేస్తున్న బికె.పార్థసారథి, కనగానపల్లిలో జలదీక్ష చేపట్టిన తెలుగు యువత నాయకులు, పుట్టపర్తిలో దున్నపోతుకు వినతి ఇస్తున్న పల్లె, టిడిపి శ్రేణులు

చంద్రబాబు చేసిన తప్పేంటి

వైసిపి ప్రభుత్వానికి టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి సూటి ప్రశ్న

ప్రజాశక్తి-పెనుకొండ

సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నేత చంద్రబాబు అని, ఆయన చేసిన తప్పు ఏమిటని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పార్థసారథి ఆధ్వర్యంలో టిడిపి యాదవ సాధికార కమిటీ నేతృత్వంలో సామూహిక రిలే నిరాహార దీక్ష చేపట్టారు. అనంతరం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ నుంచి ఎస్‌కెడి సర్కిల్ మీదుగా ప్రజలు, వ్యాపారులకు కరపత్రాలు పంపిణీ చేసి చంద్రబాబుకి మద్దతుగా 92612 92612 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కేశవయ్య, చిన్న వెంకటరాముడు, సిద్దయ్య, సిద్దలింగప్ప, నరసింహులు, బోయ నాగరాజు, రామకృష్ణ, లక్ష్మినారాయణ రెడ్డి, శ్రీనివాసులు, పోతిరెడ్డి, చంద్రకాంతమ్మ, గోపాల్‌యాదవ్, ప్రభాకర్, శ్రీనివాసులు, నాగరాజుయాదవ్, మైలార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తపై దాడి దుర్మార్గం

టిడిపి కార్యకర్త నారాయణపై వైసిపి రౌడీమూకల దాడి దుర్మార్గం అని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ చంద్రబాబు కి సంఘీభావంగా పాదయాత్ర చేస్తున్న నారాయణపై దాడి ముమ్మాటికీ వైసిపి సైకోల పనే అన్నారు. నారాయ ణపై దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక నాయకులు, కార్యకర్తతో కలిసి పట్టణంలో 'బాబుతో నేను' కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీరాములు, సూర్య నారాయణ, త్రివేంద్ర, సుబ్రహ్మణ్యం, వాసుదేవరెడ్డి, ప్రకాష్, శేఖర్, సన, సురేష్, విజయ్, రామచంద్ర పాల్గొన్నారు.

తెలుగు యువత ఆధ్వర్యంలో జలదీక్ష

కనగానపల్లి : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ శుక్రవారం మండల తెలుగు యువత అధ్యక్షులు బట్టా సురేష్‌చౌదరి ఆధ్వర్యంలో తెలుగు యువత నాయకులు దాదులూరు వద్ద చెక్ డ్యాంలో దిగి అర్ధ నగ్నంగా జలదీక్ష చేపట్టారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో కుమార్, ఆది, అర్జున్, మణిమోహన్, పవన్‌కళ్యాణ్, కేశవ, చల్ల శ్యాంసుందర్, బట్టా శివ, కార్తీక్, నారాయణస్వామి, కొండా, ఎసి పోతలయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన : టిడిపి

పుట్టపర్తి అర్బన్ : రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతోందని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి విమర్శించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ చేపట్టిన టిడిపి దీక్షలు శుక్రవారానికి 24వ రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం టిడిపి కార్యాలయం వద్ద చేపట్టిన దీక్షలో నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున మహిళలు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లె రఘునాథ్ రెడ్డి తో పాటు నాయకులు దున్నపోతుకు వినతి పత్రం అందించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ జగన్ రెడ్డి మొద్దు నిద్ర వీడాలని, తన మొండి వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. శాంతియుతంగా నిరసనలు చేస్తున్నప్పటికీ టిడిపి నాయకుల పైన కార్యకర్తల పైన కేసులు పెట్టి బెదిరిస్తున్నారని విమర్శించారు. జగన్ రాక్షస పాలనకు స్వస్తి పలికే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బచ్చలి పుల్లయ్య, రత్నప్ప చౌదరి, సామకోటి ఆదినారాయణ, శ్రీరామ్ రెడ్డి, పేపర్ గంగాద్రి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : అరచేతితో సూర్యుని అడ్డుకోవాలని అనుకున్నట్లు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చంద్ర బాబు నాయుడు ను అక్రమ కేసుల్లో అరెస్టు చేసి జైల్లో పెట్టారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టును ఖండిస్తూ కదిరి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు 27 వ రోజు కొనసాగాయి. ఈ దీక్షల్లో చేనేత కుల సంఘం అధ్వర్యంలో కొనసాగించారు. ఈ దీక్షలో కందికుంట పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ చేనేత సంఘం నాయకులు మోడం నాగరాజు, రమణ, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : వైసీపీ అరాచక పాలనకు అంతిమ రోజులు దగ్గర పడ్డాయని టిడిపి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మినారాయణ అన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తు శుక్రవారం టిడిపి నాయకులు ఎల్‌జి బాలకృష్ణన్ సర్కిల్‌లో దీక్షలు చేపట్టారు. టిడిపి నాయకులు చేస్తున్న దీక్షలకు న్యాయవాదులు సంఘీబావం తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు రమేష్‌కుమార్, అంజినప్ప, నాగరాజు, అనీల్ కుమార్, అజ్మత్, రామాంజినమ్మ, పరిమళ, అమర్నాథ్, నెట్టప్ప, రాము, విజయలక్ష్మి, హిదాయతుల్లా పాల్గొన్నారు.

సైకో పోవాలి బాబు రావాలి : మాజీ ఎమ్మెల్యే ఈరన్న

అమరాపురం : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మండల పరిధిలోని గునేపల్లి బస్టాండ్ నుంచి హేమవతి లోని హెంజారు సిద్దేశ్వరస్వామి దేవస్థానం వరకూ మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు ఉగ్ర నరసింహా, రైతు సంఘం కార్యదర్శి దయానంద, తమ్ముడేపల్లి హనుమంతరాయ, ఒక్కలిగ సంఘం నాయకుడు పాండురంగప్ప, ఆదినారాయణ, బిఎల్ఆర్ వీరకేతరాయ, బుజ్జి, హేమావతి శివన్న, గునేపల్లి ఎమ్మార్ తిప్పేస్వామి, ఈశ్వరప్ప పాల్గొన్నారు.

'బాబుతో నేను' కరపత్రాలు పంపిణీ

మండల పరిధిలోని బసవనపల్లి గ్రామంలో మాజీ జడ్పిటిసి నరసింహమూర్తి, మండల కన్వీనర్ గణేష్ ఆధ్వర్యంలో 'బాబుతో నేను' కరపత్రాలను పంపిణీ చేశారు. సామూహిక రిలే నిరాహార దీక్షలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, నాయకులు దాదు, హనుమంతరాయ, ఆలదపల్లి పాండు, మల్లికార్జున, కృష్ణమూర్తి, బసంపల్లి పరమేష్, రామచంద్ర యాదవ్, శివరుద్రప్ప, చెన్నప్ప, రఘు, నవీన్ పాల్గొన్నారు.

బుక్కపట్నం : చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ మండల కేంద్రంలో శుక్రవారం నాడు టిడిపి నాయకులు పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ విజన్ కలిగిన నాయకుడిని అక్రమ కేసులో నిర్బంధించడం హేయమైన చర్య అన్నారు. కేవలం రాజకీయ కక్షతోనే చంద్రబాబు నాయుడు అరెస్ట్ చేసి తన పైశాచిక ఆనందాన్ని ముఖ్యమంత్రి పొందుతున్నారని విమర్శించారు. అనంతరం నాయకులు పోస్టకార్డు ద్వారా తమ నిరసన వ్యక్తం చేస్తూ లేఖలు రాశారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, తెలుగు మహిళ అధ్యక్షురాలు లావణ్య గౌడ్, నాయకులు సయ్యద్‌బాషా, మాజీ ఎంపీటీసీ జయరాం, వాజిద్‌బాషా, రామాంజనేయులు, రమణ, కేశప్ప పాల్గొన్నారు.





హిందూపురంలో నల్ల దుస్తులు ధరించి దీక్షలో పాల్గొన్న తెలుగుతమ్ముళ్లు, కదిరిలో దీక్షలో మాట్లాడుతున్న కందికుంట వెంకటప్రసాద్

జూనియర్ న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పిటిషన్ పై దాఖలు చేసే వెల్ఫేర్ స్టాంప్‌ను హెచ్చు గా పెంచడం పై పుట్టపర్తి బార్ అసోసియేషన్‌కు చెందిన జూనియర్ న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం విధులను బహిష్కరించి ఏపీ బార్ కౌన్సిల్ నిర్ణయం ఏకపక్షమని మండిపడ్డారు. ఇటీవల ఏపీ బార్ కౌన్సిల్ వెల్ఫేర్ ఫండ్ నిమిత్తం ప్రతి పిటిషన్ పై దాఖలు చేసే వెల్ఫేర్ స్టాంప్ ను దాదాపు గా ఇరవై రెట్లు పెంచిందన్నారు. తద్వారా పిటిషన్ దాఖలు చేసే అంశం భారంగా పరిణమిస్తుందన్నారు. న్యాయవాదులు కక్షిదారుల మధ్య రుసుము చెల్లింపు వ్యవహారంతో భారీ వ్యత్యాసాలు చోటుచేసుకుంటాయన్నారు. ఏపీ బార్ కౌన్సిల్ కింది స్థాయిలో బార్ అసోసియేషన్లను సంప్రదించకుండా ఏక పక్ష నిర్ణయం తీసుకోవడం అన్యాయమన్నారు. జిల్లా నుండి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా లో ప్రాతినిధ్యం వహిస్తున్న రామిరెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 16 వ తేదీ వరకు విధులను బహిష్కరిస్తున్నట్లు పుట్టపర్తి న్యాయమూర్తి రాకేష్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కోర్టు బయట బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నిడిమామిడి శ్రీనివాసులు, రాజేంద్రప్రసాద్ రెడ్డి, గంగిరెడ్డి, నాగమల్లేశ్ రెడ్డి, లెక్కల యదుభూషన్. నాగేంద్ర ప్రసాద్, లెక్కల కృష్ణప్రసాద్, నాగార్జున, కె. శ్రీనివాసులు, మహేష్, మహేశ్వరి మౌనిక, చంద్రశేఖర్, బిందు, ఇందిర, భారతి, కృష్ణమూర్తి, రాజగోపాల్, అజయ్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ న్యాయవాదులు